# అచ్చులపాటివారి యిళ్లల్లో పునస్సంధాన కార్యాలు

శ్రీమతి శ్రీపాద శారదాదేవిగారు

వ్యాకరణద్వీపాగ్రహారములో బ్రాహ్మణులకు ముఖ్యముగా అచ్చులపాటివారికి ఆ సంవత్సరమొక క్లిష్టసమయముగా పరిణమించినదనగానే మనమందఱము వారికి సానుభూతి చూపింపకుండ నుండజాలము. అచ్చుల పాటివారి ఆడపిల్లలు పెండ్లిండ్లయినతరువాత రజస్వలలై పునస్సంధాన కార్యాలు మిగిలిపోయినందున వారి పరిస్థితులు ఆగ్రామములో చాల వివాదాస్పదముగా లోకులు చెప్పుకొనునంతటివఱకు వచ్చివేసినవి. కాబట్టి ఆకన్యలకు కార్యము లెంత త్వరగా నిశ్చయపరచిన నంతశ్రేయస్కరమనుమాట వారి తల్లిదండ్రులు గమనించి పొరుగూరి కాపురస్థులైన అక్షయ సిద్ధాంతి గారికి కబురంపినారు. కబురందినదో లేదో కాని ఆమరునాడే అక్షయసిద్ధాంతిగారు వ్యాకరణాగ్రహారములో ప్రత్యక్షమైనారు. అందుచేత ఆయనకు నాగంతుక బ్రాహ్మణుడను పేరొకటి వాడుక పైరైపోయినది.

ఆయన ముహూర్తాలు పెట్టుటకు ఆలోచనచేయ నారంభించెను. ఆయన మాత్రమే గాక ఆగ్రామస్థులలోని మఱికొందఱు సిద్ధాంతులు కూడా వారితో సంప్రదించిరి. వారికిని అక్షయ సిద్ధాంతికిని మధ్య కొన్ని సంజ్ఞలు నడిచినవి. సంజ్ఞాప్రకరణము పూర్తియైన వెంటనే పునస్సంధాన (సంధి) ప్రకరణమునకు ప్రవేశించిరి.

ఆసంవత్సరము కార్యము కావలసిన బాలికల పేర్లు పాఠకులు తెలిసికొన కుతూహలురై యుందురని నేను వేరుగా వ్రాయనక్కరలేదు. కావున వయస్సును బట్టి వారిపేర్లు వరుసగా నిచ్చుచున్నాను మొదటి కన్యపేరు అత్తమ్మ, రెండవదాని పేరు ఇత్తమ్మ, మూడవ దానిపేరు ఉత్తమ్మ. వారి భర్తల నామములను కూడ చెప్పి అసలుకథ నడిపించుతాను. ఆగర్భాధానపు ముగ్గురి పెండ్లికొడుకులపేళ్లు వరుసగా అచ్చయ్య, స్వరయ్య మాష్టరు ప్రాణం. ఆ కన్యకలకు వారొనర్చు పునస్సంధాన ముహూర్తాలు ఒక్కనాడే ఆరంభమైనవని చెప్పినచో మీకందఱకూ నాశ్చర్యముగా దోపవచ్చును. కాని యీ వ్యాసారంభములో నేను సూచించిన క్లిష్టసమయమిదియేయని మీరు తెలిసికొనగలరు. అయితే పునస్సంధాన కార్యాలు మాత్రమొకటే లగ్నమందు జరుగును కాని వారి కథలు మీకు చెప్పవలెననగా ఒకటి తరువాత మరొకటి చెప్పవలసినదే కదా! కావున నేటి యీ వ్యా[illegible]ములో అత్తమ్మ గారి గర్భాధానపు ముచ్చట్లు ఆయూరి

అమ్మలక్కలు చెప్పుకొన్నవిధముగా మీకు బహిరంగపరచుట అసభ్యముగా నుండునేమో యన్నశంక నాకు గలుగకపోలేదు కాని యీకథ చదువ తటస్థపడిన ప్రతి స్త్రీ వ్యక్తియు తమయొక్క గాని పరాయిగాని మగవాళ్లెవరును లేకుండగ చదివి ఆనందించి ఆడుపిల్లల యాత్మగౌరవమునకు భంగము కాని విధముగా బ్రవర్తిల్లెదరను దృఢ విశ్వాసముతో స్త్రీ ప్రపంచమునకు దెలియ జేయుచున్నాను.

## మొదటిరాత్రి

అత్తమ్మ గర్భాధానము నాటిపగలు దంపతులు పీటలమీద కూర్చుండి పురోహితులు నడిపించిన మంత్రతంత్రముల ననుసరించినందున నాటి శుభకార్యములోని పూర్వభాగమున క్రమముగా గడచిపోయినది. రాత్రిభోజనానంతరము శోభనాలగది చక్కగా అలంకరింపబడి గర్భాధానపు పెండ్లికుమార్తెను పెండ్లికొడుకును సుఖశయ్యాసనమున జేర్చునప్పటికి సుమారు పదునొకండు గంటలైనది. అప్పటికప్పుడే పేరంటాండ్రందఱు వచ్చివేసినారు. వారితో నిండి యాశోభనాలగది కిటకిటలాడిపోవుచు ఒకవింతశోభ కలిగించుచు ముత్తైదువులకు కన్నులపండువుగ నుండెను.

అత్తమ్మకు సిగ్గు తలమునకలైనందున తలవంచుచునేయుండెను. అచ్చయ్యగడుసు వాడుగను తమలపాకులకిల్లీలు మార్చుకొను సమయమునందు తమలపాకులబోలు మరేవియో కొన్నియాకులు తెచ్చి అత్తమ్మకియ్యగా పేరటాండ్రబలవంతముపైన సత్యము నిత్యమనుకొని అత్తమ్మవానిని గ్రహించినది. అట్లాబలవంతము పెట్టిన అమ్మలక్కలు ఎవ్వరనుకొన్నారు? వెంకమ్మ (వెంక + అమ్మ), రామక్క (రామ + అక్క), ముమ్మడయ్య (ముమ్మడ + అయ్య) అనువారలే. వీరే నిత్యమంగళి పాడుచుండగా ఆమ్రేడితమ్మయను సాతె పడుచుకూడ మంగళహారతి పట్టుకొని వారి రాగములో తనరాగము కలిపినది. అంతట ముత్తైదువు లందఱు తమతమ గృహములకు వెళ్లిరి.

## రెండవరాత్రి

రెండవనాడు రాత్రిగడుసు పెండ్లికొడుకు అచ్చయ్యచేసిన వేళాకోళాలకు అత్తమ్మ వైపువారు పట్టుబట్టి కొన్ని నిషేధాలు గనుపరచినారు. అవియేమనగా పెండ్లికొడుకు పెండ్లికుమార్తెను వేళాకోళము చేయునప్పుడు పూర్వపు నాటిరాత్రిరీతిగా సంస్కృతములో (తత్సమంగా) మాట్లాడకూడదనుట యొకటి, స్త్రీ వాచకము గౌరవమైనది గనుక అదియు కూడదనుట రెండవది; సంబోధనయనగా పేరుపెట్టి పిలుచుట తమయింటి సాంప్రదాయమునకును హిందువుల సాంప్రదాయమునకును విరుద్ధమాట చేనదియు కూడదనుట మూడవది; అవధారణగా (అదేధోరణిగా) మాట్లాడుట కాలెత్తెత్తివేసి నడిచినట్లుండును గావున అదియు గూడదనుట నాల్గవది. ఈ విషయ

ములో మీకును మాకును జరుగు వివాద ములలో సంధికుదురదని అత్తమ్మగారి వైపు ఆడవాండ్రందరు పట్టుపట్టి అచ్చయ్య ఆడుబంధువులకు ఖచితముగా చెప్పివైచి నారు. అంతట అచ్చయ్యవైపు ఆడ చుట్టాలు "అట్లా అస్పష్టముగా చెబితే మాకు తెలియదు. నిదర్శనపూర్వకంగా చెబితేనే మేము వింటాము లేకపోతే మా అబ్బాయిని తీసుకొని మేము వెళ్లిపోతా" మని అన్నారు. అదివిని అత్తమ్మ బంధువులు ఇచ్చిన యీ క్రింది ఉదాహరణములతో కొంత కాలక్షేపము జరిగినది.

(1) "మొదటిరాత్రి మనమంతా ఇక్కడ ఉన్నవారమే కాబట్టి తత్సమంగా మాట్లాడ కూడదన్నది మీకును మాకును స్పష్టమే కదా ?

(2) "రెండవదంతగా గౌరవముగా (కష్టంగా) ఉండదు కాబట్టి మేము చెప్పుట గాని మీరు వినుటగాని అంత మంచిదిగాదు. పెండ్లికొడుకు, అత్త ఇదిగో అంటే అత్త యిదిగో అనుమని నిర్బంధముచేస్తే అత్త గారు నిషేధించుట యేమి యాశ్చర్యము?

(3) "అత్తమ్మా! ఇదిగో నీకు ఢిల్లీనుండి కిల్లీలు తెప్పించాను అని అనడానికి అత్త మ్మిదిగో నీకు ఢిల్లీకిల్లీలని అనగూడదు." (అట్లంటే పెండ్లికొడుకు అత్తమ్మా! యిదిగో నీకు అని సాగింపవచ్చునా అని అడిగేడు) కూడనిదానికి నాల్గవ ఉదాహరణం వినండి. పెండ్లికొడుకు అత్తమ్మనుచూచి పురాణాల లోని ఆడవాళ్లవలె నాకు పుత్రసంతాన మిమ్మని నీవ—అడుగకూడదని భార్యతో చెప్పకూడదంటే అచ్చయ్య నీవయడుగ కూడదని యనెదను లేండియని అత్తగారి వైపు నిషేధానికి తలదాల్చినాడు. కాబట్టి యిది మాకు నిష్టమే."

ఇట్లేవియో వియ్యపురాండ్రకు నడిచిన సంజ్ఞ అర్థముగాక అప్పటికింకా నిలిచి యున్న బంధువులు ఆశాభంగముతో నుండి పోవలసి వచ్చినది. సంజ్ఞాప్రకరణమైన తరు వాత సంధిప్రకరణముండుట సహజమేకదా!

మూడవనాటిరాత్రి వికల్పముగా ఒక వంతు నడచినది. అదెట్లైనను నందఱు గ్రహింపగలిగియే యుందురు.

మఱిమూడురాత్రులు నిద్రలైన తరువాత కొంత అన్యవిధముగా గూడ జరిగినదని చెప్పినచో బహుళముగా జరిగినదని మీ రందఱు గ్రహించియేయుందురు. కావున అత్తమ్మ పునస్సంధానకథా కథనము నేటికి ముగించివేయుచున్నాను.

---